

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : జడ్జి

కడప : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత అన్నారు. బుధవారం జడ్జి వివిధ చట్టాలపై పిసి అండ్ పి ఎన్ డి టి ఆక్ట్ అంశాలపై నగరంలోని జడ్‌పి పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ సిటిజెన్ చట్టం, వినియోగదారుల చట్టాలు, వినియోగదారుల ప్రొటెక్షన్ యాక్ట్ 2019, నీటితో సహా పర్యావరణ పరిరక్షణ, పిసి అండ్ పి ఎన్ డి టి ఆక్ట్ అంశాలను వివరించారు. 181 ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్, 14567 సీనియర్ సిటిజన్స్ హెల్ప్ లైన్ మొదలగు టోల్ ఫ్రీ నెంబర్ లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏదైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విమల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, మహిళలు, పారా లీగల్ వాలంటరీ అరుణకుమారి, కుమారి, అరుణ పునీత లారెన్స్ ఓల్డ్ ఏజ్ హోమ్ ప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

వణికిస్తున్న..చలి!



గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
వెంటాడుతున్న ఆరోగ్య సమస్యలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలను చలిపులి వణికిస్తోంది. డిసెంబర్ నుంచి చలి తీవ్రత పెరిగింది. వృద్ధులు, పిల్లలు ఆరోగ్య సమస్యలను ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధుల్లో ఆస్మా పిల్లల్లో చర్మ అలర్జీ, జలుబు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు వెంటాడుతున్నాయి. ఆస్మా బాధితులకు చలికాలం వచ్చిందంటే ఇన్‌హేలర్‌ను పీల్చితేగానీ సక్రమంగా శ్వాస ఆడని పరిస్థితి ఎదురవుతోంది. వృద్ధుల్లో ఊపిరి బిగబట్టిందని కుంగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. అలర్జీ బాధితుల పరిస్థితిని గమనిస్తే ఇన్ఫెక్షన్ కారణంగా విపరీత సమస్యలను ఎదుర్కోవాల్సివస్తోంది. చలిగాలి వల్ల జలుబు, గొంతు వాపు, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేయడం వంటి సమస్యలతో ఎడతెగని దగ్గు వంటి సమస్యలు వెంటాడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా పలువురు అనారోగ్య పీడితులు వైద్యుల దగ్గరకు పరుగులు తీస్తుండడం కనిపిస్తోంది.



చాపాడు మండలంలోని ఓ గ్రామంలో మంచుతో కప్పిన రహదారి

కనిపించని రహదారులు

పెరుగుతున్న చలి, మంచుపుప్పటి కారణంగా రహదారులు కనిపించడం లేదు. ప్రతి రోజూ ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు రహదారులు కనిపించడం లేదు. గువ్వలచెరువు ఘాట్, రాయచోటి, మదనపల్లి, భాకరాపేట, రైల్వేకోడూరు వంటి ప్రాంతాల్లో రహదారులు మంచు వర్షం కురిసిన తరహా వాతావరణం ఏర్పడుతోంది. ఫలితంగా జాతీయ రహదారుల్లో అక్కడక్కడ ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలూ ఉన్నాయి. పగటి వేళల్లోనూ ఫ్యాన్, ఎసిలను వినియోగించడం లేదు. విద్యుత్ వినియోగం సైతం తగ్గుముఖం పట్టింది. రాత్రి వేళల్లో ఫ్యాన్ వినియోగం కారణంగా జలుబు చేయడం వంటి అనారోగ్య పరిస్థితులు ఎదురవుతుండడం తెలిసిందే. ఉదయం 8.30 గంటల సమయంలో చలి వాతావరణం కనిపిస్తోంది. పెరుగుతున్న చలి తీవ్రత కారణంగా క్రీడాకారులు సైతం ముఖానికి మాస్కులు ధరించడం, చలికోట్లు ధరించి క్రీడాంగణాలకు వెళ్లడం కనిపిస్తోంది. ఉదయం బిపి, సుగర్ బాధితులు తప్పనిసరిగా వాకింగ్ నియమానికి ముందువెనకడుతున్న వైనం కనిపిస్తోంది. ఫలితంగా పలువురు అనారోగ్య సమస్యల బారిన పడుతుండడం గమనార్హం.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. పగటి పూట 35 డిగ్రీలు, రాత్రి పూట 23 డిగ్రీలకు పడిపోతున్న సంగతి తెలిసిందే. భూమిలో తేమ శాతం తగ్గే కొద్దీ చలితీవ్రత పెరుగుతోంది. కడప జిల్లాలోని కడప, ఒంటిమిట్ట, అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, రాయచోటి, చిన్నమండెం, మదనపల్లి ప్రాంతాల్లో చలి తీవ్రత పెరుగుదల కారణంగా ఉష్ణోగ్రతలు అమాంతంగా పడిపోతున్న సంగతి తెలిసిందే. ఏటా డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు చలితీవ్రత ఉంటుంది. వెల్లువ పీడితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం ఆందోళన కలిగిస్తోంది.

పంటతోటలకూ పరిహసమే!

శీతాకాలపు పొగమంచు, చలితీవ్రతల కారణంగా పండ్ల తోటలపై దుష్ప్రభావం పడుతోంది. ముఖ్యంగా మామిడి, మునగ, నువ్వుల, పసుపు వంటి తోటల పూత దశలపై గణనీయమైన ప్రభావం పడే అవకాశం ఉంది. పూత రాలిపోవడం, పురుగు ఆశించడం దిగుబడులపై ప్రభావం చూపడం వంటి సమస్యలతో సతమతం కావడం తెలిసిందే. బుడ్డశనగ, వేరు శనగ వంటి ఆరు తడి పంటలకు కలిసి వచ్చే అవకాశమూ ఉందని చెప్పవచ్చు. ఏదేమైనా కొంచెం ఖేదం...కొంచెం మోదం అని చెప్ప వచ్చునడంలో సందేహం లేదు.

చిరువ్యాపారుల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న తోడు' పథకం చిరు వ్యాపారుల ఆర్థిక ప్రగతికి బాసటగా నిలిచిందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంత్రులు, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కలిసి మూడవ ఏడాది 'జగనన్న తోడు' పథకం 6వ విడత లబ్ది మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. విసి ముగిసిన అనంతరం స్థానిక విసి హాలులో పథకానికి సంబంధించి జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 8,240 మంది చిరు వ్యాపారులకు మంజూరయిన రూ.8,24,00,000లతో పాటు.. 22,366 మంది మహిళలకు మంజూరైన రూ. 49,41,334 ల వడ్డీ రాయితీ మొత్తం మెగా చెక్కును గౌరవ అతిథులతో కలిసి కలెక్టర్ వి.విజయ్ రామరాజు లబ్ధిదారులకు అందజేశారు. విసి అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జగనన్న తోడు కార్యక్రమం ద్వారా పేద చిరు వ్యాపారస్తులకు ఎలాంటి వడ్డీ లేకుండా రూ.10 వేలు అందించడం జరుగుతోందని, ఈ రుణం సంవత్సర కాలంలో వడ్డీ లేకుండా కేవలం రూ.10 వేలు మాత్రమే తిరిగి చెల్లించేలా ప్రభుత్వం సౌలభ్యం కల్పించిందన్నారు. రుణం పూర్తయిన తరువాత మరోసారి రూ.10 వేలు తీసుకునే అవకాశం ఉందన్నారు. పథకాన్ని లబ్ధిదారులు సక్రమంగా సద్వినియోగించుకుని తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలని చెప్పారు. అర్హత ఉండి లబ్ధిని ఇంకనూ ఎవరైనా పొందలేక పోయి ఉంట సంబంధిత గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతరాయంగా సాగే ప్రక్రియ అని చెప్పారు. ఫిర్యాదుల కోసం జిల్లా కేంద్రంలో సంబంధిత డిఆర్‌డిఎ, మెప్మా అధికారులను గానీ లేదా రాష్ట్ర ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ : 1902 కు గానీ కాల్ చేయవచ్చన్నారు. అనంతరం హాజరైన చిరు వ్యాపారులను ఉద్దేశించి ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ... గతంలో తన సుదీర్ఘ పాదయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది చిరువ్యాపారులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచే దిశగా.. 'జగనన్న తోడు"ద్వారా ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతోందన్నారు కార్యక్రమంలో జేసీ సాయికాంత్ వర్మ, కమలాపురం, మైదుకూరు ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్. రఘురామిరెడ్డి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పాకా సురేష్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి
- యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు మనోహర్

ప్రజాశక్తి -కడప అర్బన్

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కడప తహశీల్దార్ బుధవారం విఆర్ఎల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి. మనోహర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్ఎలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నెరవేర్చాలని కోరారు. విఆర్ఎ వ్యవస్థ పుట్టినప్పటి నుంచి వారసత్వం ఉందని, దీనిని యధావిధిగా కొనసాగించాలని పేర్కొన్నారు. అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రావాల్సిన బకాయిలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. కరోనా నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న అలవెన్స్‌ను విడుదల చేయాలని తెలిపారు. విఆర్ఒలకు కనీస వేతనం రూ. 26 వేల ఇవ్వాలి పేర్కొన్నారు. ఆపిన అరియర్స్ కొనసాగించాలి చెప్పారు. డిఎ రికవరీ చేయాలని మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి. వెంకటసుబ్బయ్య, వీఆర్ఏల నాయకులు పవన్, ప్రసాదు పాల్గొన్నారు.

18న కానిస్టేబుల్ నమూనా పరీక్ష

కడప అర్బన్ : డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబోయే కానిస్టేబుల్ నమూనా పరీక్షలు అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని వన్ టౌన్ సిఐ నాగరాజు తెలిపారు. నమూనా కానిస్టేబుల్ పరీక్ష కరపత్రాన్ని బుధవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఇటువంటి ప్రతిభా, నమూనా పరీక్షలు పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. .ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తున్న యువజన సంఘాన్ని అభినందించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు నమూనా పత్రం రూపొందించారని తెలిపారు. పరీక్ష రుసుం రూ.100 అన్నారు. 18న మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంతాలలో నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులందరూ 99 12 75 85 15, 63023 07292 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు షాకీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం : పిసిసి

కడప : రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర స్ఫూర్తిగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు, కార్యకర్తలు అందరూ చేయి చేయి కలుపుదాం, కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేసి 2024లో అధికారంలోకి తీసుకు వస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 26 నుంచి రెండు నెలల పాటు రాష్ట్రంలో అన్ని జిల్లాల అధ్యక్షులు నగర అధ్యక్షులు మండల అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలతో పాదయాత్ర నిర్వహిం చబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన, శత్రువు జగన్మోహన్ రెడ్డి నే అని అన్నారు. చేతగాని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. పిసిసి రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి మాట్లాడుతూ 'కాంగ్రెస్ పార్టీని గెలిపించు కుందాం..రాష్ట్రాన్ని రక్షించుకుందాం ' అనే నినాదంతో ప్రజల్లో వెళతామన్నారు. ఏఐసీసీ సెక్రటరీ మే అయ్యప్పన్ మాట్లాడుతూ 2024లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే అందరి ధ్యేయమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింతగా బలోపేతం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో నగర అధ్యక్షుడు వై. విష్ణు ప్రీతం రెడ్డి, కమలమ్మ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతం, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు మధు, రాష్ట్ర నాయకులు నజీర్ అహ్మద్, సత్తార్, చార్లెస్, జిల్లా నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆమోదించారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రరాజు

యువకులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

యువకులు క్రీడల్లో రాణించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం కెఒఆర్ఎం క్రికెట్ గ్రౌండ్‌లో జమీల్ ఛాంపియన్స్ ట్రోఫీ 2023 ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. అనంతరం బహుమతుల ప్రధానోత్సవం చేపట్టారు.ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ లీగ్ నిర్వహించిన జమీల్, వారి మిత్ర బృందానికి అభినందించారు. స్పాన్సర్లుగా వ్యవహరించిన జమీల్ మొబైల్స్ యాజమాన్యం క్రీడలకు, క్రిడాకారులకు ప్రోత్సాహం ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం విద్య సాధన కళాశాల కరస్పాండెంట్ పి.మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ సమాజ శ్రేయస్సు కోసం పని చేయాలని కోరారు. జమీల్ పేరు మీద జరిగే ఈ లీగ్ లో పాల్గొన్న 8 టీంలకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రోఫీ నిర్వాహకులు, కె.కె.ఆర్ అధ్యక్షుడు తారిఖ్ అలీ మాట్లాడుతూ ఫైనల్ మ్యాచ్ కు విచ్చేసిన అతిధులు, ముఖ్య అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫైనల్ మ్యాచ్ లో షైనింగ్ కె.కె.ఆర్ 11, మరియు మేధన్స్ స్టార్ 11 మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో షైనింగ్ కె.కె.ఆర్ జట్టు తమ అద్భుతమైన ఆట తీరుతో జమీల్ ట్రోఫీ కైవసం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్ మోహిద్, మ్యాన్ ఆఫ్ దీ సీరీస్ ఫయాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసాధన కళశాల అధినేత పి.మన్సూర్ అలీ ఖాన్, జమీల్ మొబైల్స్ అధినేత జమీల్, ముష్టాక్, టిడిపి నాయకులు సుబ్బారెడ్డి, హీనా, అఖిల్, తాహిర్ కె.కె.ఆర్ సభ్యులు సమీ పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అతిధులు

ఐదుగురు గంజాయి విక్రేతలు అరెస్టు : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని దువ్వూరు మండలం గుడిపాడు గ్రామ సమీపంలో గంజాయి అక్రమ రవాణా, దొంగ నోట్లు చలామణి చేస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారని ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులు నవీన్ కృష్ణ, హరి, బాబా ఫక్రుద్దీన్, ముని రెడ్డి ఓబులేసును పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు. వీరి వద్ద నుంచి 30 కిలోల గంజాయి, మూడు కార్లు, ఐదు సెల్ ఫోన్లు, ఏడు నకిలీ రూ.500 నోట్లు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. నలుగురు తప్పించుకున్నారని వారిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. గంజాయి నిల్వ ఉన్న, సాగు చేసిన, విక్రయించిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని చెప్పారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలను డయల్ 100కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. సమావేశంలో మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్, సీఐ నరేంద్ర రెడ్డి దువ్వూరు ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

'రాజు' అక్రమ అరెస్టు దారుణం

కడప అర్బన్ : ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెస్ రాజును పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డ. గుర్రప్ప, టి డి పి రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రాజశేఖర్ అన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు కావలిలో దళితులపై జరుగుతున్న వరుస దాడులకు నిరసనగా చలో కావలి కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. దీనిని పోలీసుల అడ్డుకుని ఎమ్మెస్ రాజును అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని చెప్పారు. ప్రభుత్వం ఆయనకు ఎలాంటి ఇబ్బందులు కలగజేసినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, కమలాపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పుల్లగూర శ్రీనివాసులు మాట్లాడుతూ దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని, దాడులను బాధిత దళిత కుటుంబాలను ప్రజా క్షేత్రంలో పరామర్శించడానికి వెళ్తున్న ఎస్సీ నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. దీనికి పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని ప్రజా వ్యవస్థలు శాశ్వతం అని పోలీసులు గుర్తు పెట్టుకోవాలి అన్నారు. సమావేశంలో ఐటీడీపి జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ మీడియా కో-ఆర్డినేటర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ ఫాజుల్ రెహమాన్

కడప అర్బన్ : నగరం లోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఫుల్ అడిషనల్ ఛార్జ్ వైస్ చాన్సలర్‌గా ఆచార్య పి. ఫాజుల్ రెహమాన్ గుంటూరు ని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వ విద్యాలయం కార్యనిర్వాహక మండలి సమావేశం ఉన్నందున కడపకు రాలేకపోయారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సెక్రటరీ నజీర్ అహ్మద్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించినట్లు రిజిస్టర్ ప్రొఫెసర్ ఈ.సి.సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, వైఎస్ఆర్ఎఫ్‌యు సూపరింటెండెంట్ వై. పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

టికెట్లు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కడప అర్బన్ : సినిమా టికెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్న థియేటర్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ లోని ఏవో విజయ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా విడుదలవుతున్న వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య ఫ్యాన్స్ షోలకు వెయ్యి నుంచి రూ.1500 లకు పైగా అభిమానుల నుంచి అక్రమ వసూలు చేయడానికి థియేటర్స్ యాజమాన్యం సిద్ధమైందని విమర్శించారు. వినోదాన్ని వ్యాపారంగా మార్చి అభిమానులు, ప్రేక్షకుల నుంచి నిలువు దోపిడికి తెరలేపుతున్నారన్నారు. కనీస మౌలిక వసతులు కల్పించకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం టికెట్ ధరలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే జిల్లా యంత్రాంగం స్పందించి థియేటర్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, నాయకులు జగదీష్ పాల్గొన్నారు.

సైకో పోవాలి సైకిల్ రావాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

సైకో పోవాలి సైకిల్ రావాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్‌బాబు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వికాష్ హరి, తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు సానపురెడ్డి శివ కొండారెడ్డి, రైతునాయకుడు లక్ష్మి రెడ్డి అన్నారు. బుధవారం 46వ డివిజన్ లో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. అమ్మ ఒడి వేసి నాన్న బుడ్డి ద్వారా మూడింతల సొమ్ము దోచుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, 46 వార్డు ఇన్‌ఛార్జి భరత్ కుమార్ రాజు, కృష్ణంరాజు, అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, రాష్ట్ర నాయకులు సానపురెడ్డి రవిశంకర్ రెడ్డి, వరప్రసాద్, నబీకోట్ శ్రీనివాసులు, నగర ఉపాధ్యక్షులు మమ్మద్,నాయబ్, వార్డు ఇన్చార్జులు కొండేటి జనార్దన్ రెడ్డి,గాజులపల్లి రాఘవ, శ్రీనివాసులు నాయుడు, రాయల్ కరీముల్లా, సాధిక్ పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికయిందని ఎన్నికల ఆఫీసర్‌గా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సి సుధాకర్ రెడ్డి వివరించారు. కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం. భరత్ రెడ్డి, కార్యదర్శిగా ఏ. రెడ్డి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా జి. నగేష్ కుమార్ రాజు, జాయింట్ సెక్రటరీగా సాయి పృథ్వి తేజ్, కోశాధికారిగా ఎం. మహేంద్ర రెడ్డి, కౌన్సిలర్ గా కె. నిరంజన్ కుమార్, ఆడిట్ ఆఫీసర్ గా షేక్ ఖదీర్‌బాష, మహిళా రిప్రజెంటేటివ్ గా ఎం మౌనిక, మెన్ రిప్రజెంటేటివ్ గా సిరాజుద్దీన్ దౌలా ఎన్నికయ్యారు. గతంలో సెక్రటరీగా సేవలందించిన పి సంజయ్ కుమార్ రెడ్డిని ఈ సందర్భంగా సన్మానించారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్



ముందస్తు సంబరాల్లో విద్యార్థులు

నగరంలోని ఎర్రముక్కపల్లిలో ఉన్న రాజు ఉన్నత పాఠశాలలో బుధవారం సంక్రాంతి సం బరాలు నిర్వ హించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించారు. పిల్లలకు భోగి పళ్లు పోసి అనం తరం భోగి మంటలు వేసి ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకున్నారు. ముఖ్య అతిధిగా బి.సి.సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాసా కోదండ రామ్, కరెస్పాండెంట్ ఉదయ్, ప్రధానోపాధ్యాయులు బొజ్జ ఓబయ్య, ఉపాధ్యాయులు ఇడెం సురేంద్ర, ఆంజనేయులు, వరలక్ష్మి, మహేశ్వరి, స్వప్న, జబీన, అమీషహిమబిందు, శాంతి పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** పట్టణంలోని శ్రీ వైష్ణవీ ఇంగ్లీష్ మీడియం, సిబిఎస్ఇ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వ హించారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ విద్యార్థులతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల పెద్ద పండుగ మూడు రోజుల పాటు జరుపుకుంటారన్నారు. కొత్త ఆలోచనలకు, అలవాట్లకు గుర్తుగా భోగి పండుగ చేసుకుంటామని చెప్పారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కల్యాణి మాట్లాడుతూ పిల్లలు పెద్దలు సంతోషంగా జరుపుకునే పడుగలలో ఇది చాలా ముఖ్యమైందని చెప్పారు. రైతులు పండించిన పంటలు చేతికొచ్చిన సమయంలో జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా మనతెలుగు రాష్ట్రాలలో జరుపుకొనే పండుగ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఇన్‌ఛార్జి కేశవ రాయుడు , ఉపా ధ్యాయులు, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **కడప :** నగరంలోని శ్రీ భాష్యం పబ్లిక్ స్కూల్ ఆవర ణంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం నిర్వహించిన రంగవల్లుల పోటీలలో విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. లాగే పాఠశాల విద్యార్థులకు గాలిపటాల పోటీలను నిర్వహించారు. అందులో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదా నం చేశారు. తర్వాత పాఠశాల విద్యార్థినులు సంక్రాంతి పాటలకు తమ నృత్యా లతో అందరికీ కనువిందు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యా యులు వి. నాగ సుబ్బారెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంధ్రా ఘన విజయం

కడప : కడపలోని వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీ మ్యాచ్‌లో చండీగఢ్ జట్టుపై 134 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో చండీగర్ జట్టు మొదటి లింక్స్ లో 186 పరుగులు చేసింది. ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 541 పరుగులు చేసింది. 7 వికెట్లు నష్టానికి 139 పరుగుల ఓవర్ నేర్చుకోరుతో చివరి రోజు బ్యాటింగ్‌కు దిగిన రెండవ ఇన్నింగ్స్‌లో 66.5 ఓవర్లలో 221 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యింది. ఆ గట్టులోని ఆ చెట్టులోని ఏ. ఏ. కుమార్ 91 (నాట్ అవుట్), తరణ్ ప్రీతిసింగ్ 28 పరుగులు చేశారు. ఎం ఆంజనేయులు మూడు, గిరినాథ్ రెడ్డి, రెండు సాకేత్ రామ్ 2 వికెట్లు తీసుకున్నారు. ఈ మ్యాచ్లో ఆంధ్ర జట్టు చండీగర్ చెట్టుపై విజయం సాధించింది. ఇప్పటివరకు ఆంధ్ర జట్టుకు 14 పాయింట్లు లభించాయి.

మహిళకు రక్తదానం

పోరుమామిళ్ల టౌన్ : పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో కలసపాడు మండలం మమిళ్లపల్లెకు చెందిన లక్ష్మి దేవి అనే మహిళకు అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరం కాగా ఆమె బంధువులు రైట్ హ్యాండ్ ఆర్గనేషన్ స్థాపకులైన షేక్ నాయబ్ రసూల్‌ను సంప్రదించారు. రసూల్ వెంటనే స్పందించి రైట్ హ్యాండ్ ఆర్గనేషన్ తరుపున పోరుమామిళ్ల గ్రామానికి చెందిన షేక్ నవీద్ చే పాజిటివ్ రక్తదానం చేయించారు. సేవా సంస్థ ఫౌండర్ అడిగిన వెంటనే ముందుకు వచ్చి రక్తదానం చేసిన షేక్ నవీద్ ను రైట్ హ్యాండ్ సంస్థ డైరెక్టర్ ప్రసాద్ పలువురు అభినదించారు. కార్యక్రమంలో రైట్ అండ్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అఖిల్, కేశవ పాల్గొన్నారు.

భావిపౌరులుగా ఎదగాలి

చెన్నూరు : విద్యార్థులు మెరుగైన ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉత్తీర్ణతను సాధించి భావిభారత పౌరులుగా ఎదగాలని పిడుగు శివనారాయణ అన్నారు, బుధవారం ఆయన కొండపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 34మంది విద్యార్థులకు పదవ తరగతి పరీక్షల స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పదవ తరగతి విద్యార్థుల కోసం పబ్లిక్ ఎగ్జామ్ స్టడీ మెటీరియల్ అందిస్తున్నామని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి మాట్లాడుతూ, విద్యార్థులందరికీ ప్రతి సంవత్సరమూ స్టడీ మెటీరియల్ అందించడం సాధ్యం కాదని, విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలని తపన పడడం పిడుగు శివ నారాయణ వ్యక్తిత్వం ఎంతో ఉన్నతమైందని కొనియాడారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విసి జింక రంగ జనార్ధన్

21 నుంచి జెవివి రాష్ట్ర సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జన విజ్ఞాన వేదిక (జెవివి) చెకుముకి రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలు ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ పేర్కొన్నారు. బుధవారం సైన్స్ సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను వైవీకూ విసి ఆచార్య జింక రంగ జనార్ధన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విద్యార్థుల్లో, సమాజంలో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంచే క్రతువులో జెవివి నిర్వహించడం ప్రశంస నీయమని చెప్పారు. రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలకు అవగాహన కల్పించడానికి, విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించడానికి జెవివి ఈ సంబరాలు నిర్వహిస్తోందన్నారు. పాఠశాల విద్యార్థులలో సైన్స్‌ను ప్రాచుర్యంలోకి తీసుకురావడం, వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో చురుకుగా పాల్గొంటుందన్నారు. తమ సంస్థ ప్రతి సంవత్సరమూ చెకుముకి సైన్స్ పాఠశాల, మండలం, జిల్లా రాష్ట్ర స్థాయిలలో నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సైన్స్ జ్ఞానాన్ని పెంపొందించడానికి క్విజ్‌లు, పరీక్షలతో సహ అనేక వినోదాత్మక కార్యకలాపాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ప్రతినిధులు సరస్వతి, పద్మావతి, సునీత, కామేశ్వరమ్మ, ప్రధాన ఆచార్యులు కె. కృష్ణారెడ్డి, జర్నలిజం శాఖ అధ్యాపకులు తుమ్మలూరు సురేష్ పాల్గొన్నారు.

పారదర్శకత పాటించాలి

కడప అర్బన్ : వైద్య ఆరోగ్యశాఖ (కడప రీజినల్ డైరెక్టర్) పరిధిలో ఉమ్మడి నాలుగు జిల్లాలకు సంబంధించి స్టాఫ్‌నర్సుల పోస్టుల్లో పాదర్శకత పాటించాలని వైఎస్ఆర్‌టియుసి మెడికల్ అండ్ హెల్త్ విభాగం రాష్ట్ర నాయకులు ఆదాల వెంగల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్యూటేషన్ కోసం గతనెలలో ఇంటర్వ్యూలు నిర్వహించారని, అందులో వచ్చిన దరఖాస్తుల్లో మెరిట్ జాబితాను తయారు చేసేందుకు సిబ్బందిని ఆర్‌డి నియమించారని తెలిపారు. మెరిట్‌జాబితా తయారు చేయడంలో యూనియన్ నాయకులను తీసుకోవద్దని తాము గతంలో ఆర్‌డికి విన్నవించామని పేర్కొన్నారు. ఆర్‌డి కార్యాలయం నుంచి మెరిట్ జాబితాలోని అభ్యర్థులకు ఫోన్లు చేసి బేరసారాలకు పాల్పడుతున్నారన్నారు. డిప్యూటేషన్‌పై ఉన్న సిబ్బంది అభ్యర్థులకు ఫోన్లు చేసే అధికారం లేదన్నారు. పైగా ప్రతి జిల్లాలోనూ కొంతమంది ఏజెంట్లను నియమించుకున్నట్లు తెలిసిందన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ యూనియన్ నాయకుడు డిప్యూటేషన్ లేకపోయినా ఆర్‌డి కార్యాలయం చుట్టూ తిరుగుతూ వ్యవహారాలను చక్కపెడుతున్నట్లు తెలిసిందన్నారు. అభ్యర్థులకు ఆర్‌డినే ఫోను చేయాలని, ఇతరుల జోక్యం తగదని తెలిపారు. ఈ విషయంలో కలెక్టర్ స్పందించి మెరిట్ లిస్టు, రోస్టరు ప్రకారం స్టాఫ్‌నర్సుల పోస్టులను భర్తీ చేయించాలని కోరారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

వల్లూరు : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని అడిషనల్ డిఎంహెచ్ఒ ఖాదర్ వల్లి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా క్షయ వ్యాధి నోడల్ ఆఫీసర్ డాక్టర్ గోపికృష్ణ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో విష జ్వరాలు, అంటువ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. మండలంలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్నలక్ష్మి, సిహెచ్ఒ వేణుగోపాల్, ఫార్మసిస్ట్ శ్రీనివాసులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

చీకటి జిఒను రద్దు చేయాలి

కడప అర్బన్ : భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే అప్రజాస్వామికమైన జీవో నంబర్ 1ని బేషరతుగా రద్దు చేయాలని బుధవారం నగరంలోని ఐటిఐ సర్కిల్‌లో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి ఓ.నాగేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల పోలీసు అమలులోకి తెచ్చిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను నియంత్రి యించుకో వాలనుకోవడం దారుణమన్నారు. సమావేశంలో నగర నాయకులు శ్రీనివాసులు రెడ్డి, విక్కీ,అశోక్,సిసింద్రీ, గణేష్ కుమార్, హేమంత్ కుమార్, షణ్ముఖ, చెన్నయ్య పాల్గొన్నారు.

ఉపకరణాలతో జీవన నైపుణ్యాలు మెరుగు

ప్రజాశక్తి - చాపాడు


వీల్ చైర్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ, ఎంఇఒ

మండల పరిధిలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు ఎంపిపి టి.లక్ష్మయ్య బుధవారం వీల్ చైర్లు, సహాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్నప్రతిభావంతుల సమస్యల పట్ల అన్ని రకాలుగా సహకరిస్తుందన్నారు. వారికి అవసరమైన ఉపకరణాలను అందిస్తుందన్నారు. తద్వారా విభిన్నప్రతిభావంతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జీవన నైపుణ్యాలు వారు మెరుగుపరుచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అయిదు వీల్‌చైర్లు, ఒక సిపి చైర్, ఒక జత చంక కర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఎంఇఒ రవిశంకర్, ఎంఆర్‌సి సిబ్బంది, ఐఇఆర్‌పి లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

సంక్రాంతి ఉత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీమాధవరాయ స్వామి ఆలయంలో నిర్వహించే సంక్రాంతి ఉత్సవాలకు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిని ఆ ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆ మేరకు బుధవారం వారు ఎమ్మెల్యే స్వగృహంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి, అందజేశారు. కార్యక్రమంలో మాధవ రాయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షుడు కెపి లింగన్న, బిఎన్ కిట్టు, తిరుమలేశు, ఎలిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ప్రజల సౌకర్యార్థం మరో రెండు అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.163కోట్లతో కాలువల ఆధునీకరణ, రూ.119కోట్లతో మంచినీటి పైప్‌లైన్, కుళాయి కనెక్షన్లు, నాలుగు వాటర్ ట్యాంకుల నిర్మాణం, ఆధునీకరణ పనులను త్వరలో ప్రారంభినున్నట్లు తెలిపారు. రూ.163కోట్లతో 70కి.మీ.ల మేర ఇంటర్నల్ కాలువలు నిర్మిస్తామన్నారు. 5.26కి.మీ.ల పనులు ప్రధానంగా కొత్తపల్లి నుండి సినీహబ్ వరకు మడూరు నుండి కొత్తపల్లి వరకు ఎక్స్‌టెన్షన్ పనులతో పాటు కొత్తపల్లిలో ఐదు ఎకరాల స్థలంలో మురికినీటి శుద్ధి కర్మాగారం కూడా నూతనంగా ఏర్పాటు చేస్తామన్నారు. వీటితో మురుగునీటిని పంట పొలాలకు విని యోగించేలా శుద్ధి చేయనున్నట్లు తెలిపారు. నీటి శుద్ధి కర్మాగార నమూనాను ప్రదర్శించారు. 2024 ఆఖరిలోపు పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. టి.బి.రోడ్డు, రామేశ్వరం, పాత మార్కెట్, అనిబిసెంట్ స్కూల్ ప్రాంతంలో నాలుగు వాటర్ ట్యాంకులు నిర్మిస్తామన్నారు. రూ.119 కోట్లతో 20వేల 500 కొత్త కొళాయి కనెక్షన్‌లు ఇస్తూ 2024 జనవరిలోగా పనులు పూర్తి చేస్తామ న్నారు. ప్రజలకు శాశ్వతంగా మంచినీటి సమస్యను తీరుస్తామని రాచమల్లు తెలిపారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్


గ్రామోత్సవం నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు

శ్రీ త్యాగరాజస్వామి 11వ ఆరాధన మహోత్సవాన్ని పట్టణంలో బుధవారం నాయి బ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు పసుపులేటి రత్నం, ఉపాధ్యక్షులు మోహన్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు కొండయ్య, నాయి బ్రాహ్మణ కమిటీ కార్యనిర్వాహకులు, వైయస్సార్ నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలివ్వాలని వినతి


తహశీల్దార్‌తో మాట్లాడుతున్న వేమారెడ్డి, ఎస్‌సి కాలనీవాసులు

ప్రజాశక్తి - చాపాడు

తమకు ఇంటి స్థలాలివ్వాలని మండలంలోని శ్రీరాములపేట ఎస్‌సి కాలనీ వాసులు బుధవారం తహశీల్దార్ సుభానిని కోరారు. ఆ మేరకు వారు వైసిపి నాయకులు పి.వేమారెడ్డి ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి కుటుంబంలోనే జీవనం సాగిస్తున్నామని, స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా స్పందించి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ గ్రామంలో విచారించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటసుబ్బయ్య, వీరేంద్ర, వీరమోహన్, సుబ్బరాయుడు, మోహన్, మహిళలు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలో చోటుచేసుకుంటున్న ఆక్రమణలపై, కబ్జాదారులపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు కొండలను పిండి చేస్తూ మట్టిని అక్రమంగా తవ్వుతున్నారని ఆరోపించారు. వైసిపి పాలనలో భూ ఆక్రమణలు ఎక్కువయ్యాయని ఆయన తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్రమణలపై విచారించి ప్రభుత్వం స్వాధీనం చేసుకొనేలా చర్యలు చేపడుతామన్నారు. సమావేశంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, టిడిపి యూనిట్ సభ్యులు మారుతి పాల్గొన్నారు.

దళితులపై దాడులు దారుణం

ప్రజాశక్తి - మైదుకూరు

దళితులపై దాడులు దారుణమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరామ్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన టిడిపి ఎస్‌సి సెల్ విభాగం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో దళితులపై వరుసగా జరుగుతున్న దాడులను నిరసిస్తూ మంగళవారం ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు యమ్ఎస్ రాజు చలో కావలి కార్యక్రమం చేపడితే.. దాన్ని భగ్నం చేసి పోలీసులు అక్రమ అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, మైనారిటీ జిల్లా అధికార ప్రతినిధి షేక్ అల్తాఫ్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ముమ్మరం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మెయిన్ రోడ్డులో విస్తరణ పనులు ముమ్మురం చేశారు. రోడ్డు విస్తరణలో కోల్పోయే భవనాలకు ప్రభుత్వం కొందరి బాధితులకు నిధులు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో అయా ప్రాంతాల్లో ఉన్న ఇంటి యజమానులు తమ భవనాలను పగులగొట్టి మరమ్మతులు చేసుకుంటున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న జడ్పీ వాణిజ్య గదులను పగుల కొట్టే పనులు ప్రారంభించారు. ఇప్పటికే కడప రోడ్డులో ఉన్న దేవస్థాన వాణిజ్య గదులను పగుల కొట్టి మరమ్మతులు పూర్తి చేశారు. నష్ట పరిహారం రాని ఇంటి యజమానులు మాత్రం పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. పరిహారం వచ్చిన తర్వాత ఇంటి మరమ్మతులు చేపట్టనున్నట్లు వారు పేర్కొంటున్నారు. కడప-పులివెందుల-గండి రోడ్డులో ఇంటి యజమానులు ఎవరికి వారు వేగంగా చేపడుతున్నారు. నష్టపరిహారం మంజూరైన వారు మార్కింగ్ వేసిన చోటికి ఇంటిని పగులగొట్టక పోతే జెసిబితో అధికారులే తొలగిస్తారని హెచ్చరించడంతో ఆ పనులు ఇంటి యజమానులు ప్రారభించారు. మెయిన్ రోడ్డులో ఉన్న ఇంటి యజమానులు అందరూ భవనాలను పగులగొట్టి మరమ్మతులు చేపడితే వేంపల్లెలో అండర్ డ్రయినేజీ, రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.


నాలుగు రోడ్ల కూడలిలో తొలగిస్తున్న వాణిజ్య భవనాలు

నూతన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


సన్మానం అందుకుంటున్న ఉత్తమ ఆదర్శ రైతు లక్ష్మిరెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

వరిసాగులో నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏఒ నాగార్జున సూచించారు. మండల పరిధిలోని త్రిపురవరం గ్రామానికి చెందిన రైతు భూమిరెడ్డి లక్ష్మిరెడ్డి నూతన యాజమాన్య పద్ధతులు పాటించి ఉత్తమ ఆదర్శ రైతుగా ఎంపికయ్యారని తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం లక్ష్మిరెడ్డిని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎఒ నాగార్జున, అతిథులు మాట్లాడుతూ.. లక్ష్మిరెడ్డి తనకున్న 33 ఎకరాల్లో 135 పుట్లు ధాన్యాన్ని పండించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమణారెడ్డి, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యు లు అచ్చుకట్ల కరీముల్లా, మండల పరిషత్ ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సు పట్టని మార్కెట్ యార్డులు

ప్రజాశక్తి - చాపాడు

వ్యవసాయ మార్కెటింగ్ శాఖను రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే అవి రానురానూ రైతు శ్రేయస్సును పూర్తిగా విస్మరిస్తున్నాయి. సంక్షేమ పథకాలను రైతుల కోసం ఏర్పాటు చేయడం, వాటిని వారికి తెలియజేయడం, ధాన్యం ధరలు తెలియజేయడం, ధరలు వచ్చేవరకు ధాన్యం నిల్వ ఉంచుకునేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. గ్రామాల్లో ఉచిత పశు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి. దళారుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా తమ ఉత్పత్తులను అమ్ముకునే ఏర్పాట్లతోపాటు పలు రైతు సంక్షేమ కార్యక్రమాలను మార్కెట్ యార్డులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ధాన్యం నిల్వ ఉంచే యార్డులుగా మాత్రమే అవి తయారయ్యాయి. గతంలో మార్కెట్ యార్డ్ తరపున పశు వైద్య సదుపాయం లేని గ్రామాలను ఎంచుకొని ప్రతి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో సంవత్సరానికి నాలుగు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవి. ఉచితంగా మందులు కూడా పంపిణీ చేసేవారు. గత మూడేళ్లుగా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టిన దాఖలాల్లేవు. రైతు బీమా పథకం ద్వారా రైతులకు బీమా సౌకర్యం కల్పించేది. మార్కెట్ యార్డులు రైతులకు పథకాలపై అవగాహన కూడా కల్పించడం లేదు. రైతు బంధు పథకం ద్వారా తక్కువ వడ్డీతో పంటలకు బీమా సౌకర్యం కల్పించేది. పంటల కనీస మద్దతు ధరలు సూచించే సూచిక బోర్డులు కార్యాలయానికే పరిమితమవుతున్నాయి. మార్కెట్ యార్డ్ ఉన్నతాధికారులు స్పందించి రైతులకు కలుగు ప్రయోజనాలపై అవగాహన కల్పించి, పథకాలను రైతులకు చేర్చితే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఆర్థికభరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 13వ వార్డులో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రకమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు వీలుగా ప్రభుత్వం సచివాలయ, వాలంటరీ వ్యవస్థలకు శ్రీకారం చుట్టిందన్నారు. వాలంటీర్ల ద్వారా పేదలను క్షేత్రస్థాయిలో గుర్తించి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ ఉండడంతో వారి జీవితాల్లో గణనీయమైన మార్పు చోటు చేసుకుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్ ముని సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, డైరెక్టర్ మార్బుల్ శ్రీను, బిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి, నాయకులు ఉప్పలపాటి యోబు, శివకృష్ణ, పాముల బ్రహ్మానందరెడ్డి మహమ్మద్ రఫీ, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ముందస్తు సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు



ఖాజీపేట : బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఖాజీపేట : స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. సాయికృప పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ప్రతినిధులు అన్వర్ బాషా, మహబూబ్ బాషా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. జడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని వరుణ్ హైస్కూల్‌లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి స్కూల్ కరస్పాండెంట్ ఎలిచెర్ల వెంకట రమణారెడ్డి బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గాలిపటాలు ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రణయ్, ఉపాధ్యాయులు రవికుమార్‌రెడ్డి, నాగార్జున, రామచంద్రారెడ్డి, రామయ్య అరుణ్, కళ్యాణి, రమాదేవి, సంధ్య, ఐశ్వర్య, సంధ్యరాణి, కుమార్ పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : నారాయణ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా మునిసిపల్ కమిషనర్ నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి యొక్క విశిష్టత, సంస్కృతి సంప్రదాయాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు పొంగలి ప్రసాదాన్ని తయారు చేసి అందరికీ పంచిపెట్టారు విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో అలరించారు. కొందరు విద్యార్థులు హరిదాసు, డూడూ బసవన్న, రైతుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎజిఎం చెన్నకేశవరాజు, పాఠశాల ప్రిన్సిపల్ సునీతారెడ్డి, సాఫ్ట్ స్కిల్స్ డిపార్ట్‌మెంట సంతోష్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఉపాధ్యాయులు జవహర్ మునీర్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే సంప్రదాయ పండుగలపై అవగాహన కల్పించడం వల్ల ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. విద్యార్థులకు పండుగ విశిష్టత గురించి వివరించారు. పాఠశాల ఆవరణలో ముగ్గులు వేయించారు. సరస్వతి విగ్రహానికి పూజ నిర్వహిం చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లె : శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, శ్రీచైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పండుగలు సంప్రదాయానికి ప్రతీకలని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక నారాయణ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బోగి మంటలకు జడ్‌పిటిసి నిప్పు పెట్టారు. విద్యార్థులను రేగి పండ్లతో ఆశీర్వాదించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ వీరారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి, పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ఉషాకిరణ్ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలుపోటీల్లో విజేతలకు ఎంఇఒ బండి వీరారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు నివాళులర్పించిన 'గిడుగు'



వైఎస్ఆర్ సమాధికి నివాళులర్పిస్తున్న గిడుగు రుద్రరాజు, నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఇడుపులపాయి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధికి ఎపి కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన ఇడుపులపాయి వ్యవసాయ క్షేత్రాన్నికి విచ్చేశారు. ఈ సందర్భంగా గిడిగు రుద్రరాజు మాట్లాడుతూ వైఎస్ఆర్ హయాంలో తనకు అనేక పదవులు వచ్చాయన్నారు. వైఎస్ఆర్‌తో సన్నిహితంగా ఉండి పార్టీ కోసం పని చేశానన్నారు. రాష్ట్రం పెద్ద నాయకుడ్ని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉత్తన్న, సత్తార్, బద్రీ, రాఘవయ్య, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


సరుకులు అందిస్తున్న సభ్యులు

పట్టణ పరిధిలోని విజయ నగరం వీధిలో ఉన్న శివుడు అనే విభిన్న ప్రతిభావంతుడికి 'ఆఫ్ యు విభిన్న ప్రతి భాంతులు, వయోవృద్ధుల సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సభ్యులు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు చలపతిరావు, కన్వీనర్ అఫ్జల్ మాట్లాడారు. కార్యక్రమానికి పల్లా నారాయణ, పల్లా ఆంజ నేయులు సహకారం అందించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఖాదర్ వలిపాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న లోక్ అదాలత్

- జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



కక్షిదారులు ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక కోర్టులో బుధ వారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి కేసులు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న కక్షిదారులకు ఇది మంచి అవకాశం అన్నారు. పగలు, ప్రతీకారాలు మాని, ప్రేమతో మెలిగే అవకాశం జాతీయ లోక్ అదాలత్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. క్షణికావేశంలో జరిగిన ఘర్షణ వల్ల జీవితాలు పోగొట్టుకోవాల్సి వస్తుందని వివరించారు. మనసు మార్చుకొని రాజీమార్గంతో రాజమార్గంలో పరిష్కరించుకునే గొప్ప అవకాశం జాతీయ లోక్ అదాలత్ అని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంక్ అధికారులు బాధితులకు అవగాహన కల్పించాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని సచివాలయ సిబ్బంది వార్డ్ కౌన్సిలర్ల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ సూచించారు. పట్టణంలోని రాణివనం, వినాయక నగర్, క్రాంతి నగర్‌కు సంబంధించిన సచివాలయాల్లో బుధవారం వార్డు కౌన్సిలర్లకు, సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది వార్డు కౌన్సిలర్ల సూచనలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఆ మేరకు వార్డు కౌన్సిలర్లు సచివాలయ సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తుంగ వెంకటరామిరెడ్డి, అలీ, భాస్కర్, చంద్రకళ, కల్లూరు సునీత, ప్రశాంత్, మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథ్

కాయతొలుచు పురుగు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు


కంది పంటను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

కంది పంటలో కాయ తొలుచు పురుగు నివారణకు జాగ్రత్తలు పాటించి, చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని బొందల కుంట గ్రామంలో రబీలో సాగు చేసిన జొన్న, ఉలవ, కంది పంటలను బుధవారం ఎఒ పరిశీలించి, పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది పంటలో కాయతొలుచు పురుగు నివారణకు ఎకరానికి కొరాజిన్ 30 ఎమ్ఎల్ మందు 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. రైతులు రబీలో సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు కాకపోతే ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ఏ పథకం వర్తించదన్నారు. ఇకెవైసి చేసుకొనకపోతే పీఎం కిసాన్ పథకం వర్తించదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుదీర్, రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ తప్పనిసరి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దుకాణంలో స్టాక్ రిజిష్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని ఎఒ నాగలక్ష్మి సూచించారు. స్థానికంగా బుధవారం ఆమె పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. గురు బాలాజీ రైతు డిపో రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ ఎరువులు విక్రయించిన బిల్లులను రైతులకు ఇవ్వాలన్నారు. ఎరువుల ధరలను బోర్డుపై రాసి ఉంచాలని సూచించారు. నకిలీ ఎరువులు అమ్మితే ఉపేక్షించేదిలేదన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

- టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు శ్రీనివాసనగర్‌లో బుధవారం పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో కలిసి ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అర్హులైన వారికి ఇళ్ల మంజూరు కాలేదని తెలిపారు. పింఛన్లు తొలగించడం అన్యాయమని ప్రజలకు వివరించారు. వైసిపి ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు కసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి సుంకర వేణుగోపాల్, 14వ వార్డు మస్తాన్ గోలే కరిముల్లా, కడప పార్లమెంటు కార్యదర్శి తెలుగు యువత ఉమ్మనూరు ఆంజనేయులు, పెన్నానగర్ మజీద్, 13వ వార్డ్ నాయబ్, 9వార్డు కరీముల్లా, భూన్, టింబర్ డిపో షఫీ, సురసుర శ్రీనివాసులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని తాళ్లపల్లె పిహెచ్‌సి మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం వేంపల్లె-8 గ్రామ సచివాలయం పరిధిలోని పక్కిరపల్లె అంగన్వాడీ కేంద్రం వద్ద సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలవిసర్జన బహిర్భూమిలో చేయకుండా మరుగుదొడ్డిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేంపల్లె సచివాలయం సిహెచ్‌ఒ బసయ్య, ఎఎన్ఎం అంజనమ్మ, అంగన్వాడీ టీచర్ దిల్షాద్, ఆశా కార్యకర్త జెమీనా పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాల్లో రెవెన్యూ అధికారులు బోర్డులను ఏర్పాటు చేశారు. గండి రోడ్డులోని పిల్ల స్వామి గుట్ట వద్ద భూ ఆక్రమణలకు ప్రభుత్వ భూమి గురైందని పత్రికల్లో రావడంతో బుధ వారం ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా ఇది ప్రభుత్వ భూమి అని తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే అలాంటి సమాచారం తమ దృష్టికి తేవాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.


బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది